కుర్చీని వెనక్కి తోసి గుమ్మం దగ్గరకి వచ్చి తలుపు తోసేడు.

పది అడుగుల ఎత్తున్న తలుపు హుందాగా నిలబడి వుంది-బైట తాళం వేయబడి. ఆటో మేటిక్ లాక్.

ప్రొఫెసర్ మొహం మీద నవ్వు మాయ మయింది. తలుపు దబ దబా బాదసాగేడు.

* * *

దాదాపు నాలుగు రోజుల్నుంచీ ప్రతిరోజూ రాత్రి పదకొండు గంటలకి భూమి కంపించటం, బీటలు వారటం సంభవించటంతో పల్లె ప్రజల్లో కొంతమందికి బాబావారిమీద విశ్వాసం సన్నగిల్లింది. చాలా కొద్దిమందికి. అందులో భూషణం ఒకడు.

అంతకు క్రితం రోజు రాత్రి వచ్చిన భూకంపంలో బాబావారు శయనించివున్న ఇంటి కప్పు కూలి, మీదపడి, ఆయన కుడికాలు విరిగింది. అందరికీ తాయెత్తులు కట్టటంలో నిమగ్నమై తన చేతికి కట్టుకోవటం మర్చిపోయినందువల్లే ఈ అనర్థం జరిగిందని భక్తులు ఏకగ్రీవంగా నిర్ణయించేరు.

పెద్ద కామందు భూషణం దగ్గర కొచ్చేడు.

"ఏమనుకుంటున్నారయ్యా ప్రజలు?" చుట్ట నుసి రాలుస్తూ అడిగేడు భూషణం.

"మన పల్లెకి పర్లేదంటున్నారు."

"ఎందుకంట?"

"ఊరి చుట్టూ మన బాబావారు నిమ్మకాయలు కోసి రసం పిండుతారంట."

"నాకు నమ్మకం లేదయ్యా. సావు తప్పదేమో అనిపిస్తూంది."

ఆ విషయం నమ్మటానికి ఇష్టపడని కామందు విషయం మారుస్తూ, "రాజయ్యగాణ్ణి ఏం సేద్దాం?" అన్నాడు.

"ఒకేపున మదిసి పేణాలే పోతావుంటే ఇక రాజయ్య సంగతంటావేమిటి?" అన్నాడు భూషణం చుట్టముక్క తుపుక్కున వూస్తూ.

"దేన్దారి దాన్దే. అయినా మన పేణాలు పోతాయనే అపనమ్మకం యెందుకు? బాబాగారు వున్నంతవరకూ పర్లేదు."

"సూద్దాంలే. ఆ పదిహేడో తారీకేదో దాటనీ——"

"అంత కాలం సేతులు ముడుసుకూక్కుసుంటే అవతలోళ్ళు నవ్వుకుంటారు. ఆణ్ని ఎట్టాగయినా కాల్సెయ్యాల. లేకుంటే, అన్న మాట నిలబెట్టుకోలేనోళ్ళమని రేపణ్నుంచి సిన్న కుర్రోడు కూడా మనని లెక్కచెయ్యడు."

"ఆణ్ణి కాల్సెయ్యటమే కదా కావల్సింది! ఇదో ఈ పదిహేడో తారీఖు కానివ్వు. ఆ తర్వాత సూసుకుందాంలే——"

"ఆ తర్వాతంటే...."

"సూద్దాంలేవయ్యా. తొందరేముంది?" లేచిపోయేడు భూషణం.

అర గంటలో ఈ వార్త రంగారావుకి పాకింది. రాజయ్యకీ తెలిసింది. అతడు సంతోషించాడు. పొలం పో....తే....పర్లే....దు.... ప్రాణా....లు.... పో....క.... పో....తే.... చా....లు....!

(ఇంకా వుంది)

వచ్చే సంచికలో

మూడు దశాబ్దాల క్రితం 'భారతి' పేజీలలో మెరసి, మాయమై ఇటీవలే

'కనక ప్రవాసి'కి దొరికిన

కీ. శే. బాలగంగాధర తిలక్ కథ

'జీవితం!'

# జ్ఞానోదయం

## ఆదూరి వెంకట సీతారామమూర్తి

"అబ్బో! ఏవిటండోయ్ యివి!" అంది సుమిత్ర శనివారం మధ్యాహ్నం తలంటుకున్న తలకి నూనె రాస్తూ.

"ఏవీ?" అన్నాను చుట్టూరా చూస్తూ.

"చుట్టూ చూస్తారేం? మీ తల్లోనే వున్నాయి నాలుకల్లా" అంది.

"ఫేలే! వెధవది. మూడ్రోజుల నుండీ ఒకటే దురద. ఏవిటో అనుకున్నా. ఆ పిల్ల ముండ స్కూల్లోవన్నీ పట్టించుకొస్తోందిలా వుంది. దాన్నిమారు నా దగ్గర పడుకోనీకు" అన్నాను కోపంగా.

"బాగుందండీ వరస - అసలు సంగతి వినరేం? పేలు కాదు. పేలాల్లా మెరిసిపోతున్నాయి వెండి వెంట్రుకలు."

"అంతేనా? ఈ రోజే చూశావు గావును! ఎప్పట్నించో వున్నాయవి" అన్నాను చల్లబడి.

"ఎప్పట్నుంచో ఏవిటండీ-నేను చూట్టంలా. మరీ విడ్డూరంగా వుందీ రోజు. కావలిస్తే చూడండి" అంటూ చిన్నద్దం తెచ్చి నా చేతి కందించబోయింది.

"నాకు తెల్సులే నా తల్లో వున్నాయని-నీకు తెలియడమే విడ్డూరం; విశేషమూను. ఎప్పుడేనా తలకి నూనె రాసిన పాపాన పోతేగా తెలియడానికి" అన్నాను కావాలనే చురక అంటిస్తూ.

"నా ముందు తలొంచడం అవమానంగా భావిస్తే నేనెలా రాయనూ? ఏ కళనున్నారో నూనె రానేందుకయినా యీ రోజు తలొంచేరు" అంటూ మరో మాటకు దొరక్కుండా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

నిజానికి నెల్లాళ్ళయి నా తలలో మెరుపు తీగలు కన్పిస్తున్నాయి. మొదట్లో ఆశ్చర్యమేసింది. తర్వాత బాధనిపించింది. ఆ తర్వాత బెంగ పట్టుకుంది. తెల్సిన డాక్టరు ఫ్రెండొకాయన వుంటే సలహా అడిగాను అప్పట్లోనే.

"షాంపూలూ హెయిరాయిల్సూ బాగా వాడి వుంటావ్. అయినా వాటి గురించి బాధెందుకోయ్? అవెలా వుంటే నీ కద్దొచ్చాయి. నువ్వు ఆరోగ్యంగా వుండు. అంతే చాలు" అన్నాడే తప్ప తెల్లవెంట్రుకలు ఎలాపోతాయో చెప్పలేదు.

అంతే! యిక ఆ ప్రయత్నానికి స్వస్తి చెప్పి సుబ్బరంగా రెండు పూటలా నూనె రాసి ఆ నాలుగు వెంట్రుకలూ బయట పడకుండా జాగ్రత్తపడసాగేను, కానీ అవేనా తక్కువ తిన్నది? ఆ నాలుగూ పది రోజుల్లో నలభై అయి కూర్చున్నాయి. ఆ నలభయ్యీ నాలుగు వందలో నాలుగు వేలో అవటానికి అట్టే రోజులు పట్టేటు లేదు అని నిర్ధారించుకున్నాక ఎదిరించలేక, వదిలేశాను. నేనంటే అంత నిర్లక్ష్యంగా వదిలేశానుగాని సుమిత్ర వూరుకుందా?

"మీకు తెలీదుగానీ రోజూ అపదం రాస్తే ఎంచక్కా నల్లబడుతాయి" అంటూ రోజూ తలకి మర్దనా చేయడం మొదలుపెట్టింది——

వారం పది రోజులు ఓపిక పట్టేను—— జుట్టంతా అంటుకుపోయి ముఖమంతా జిడ్డవడమే తప్ప గుణం కన్పించలేదు నాకు. పొద్దున్నే పచ్చిపాలు జుట్టుకు పట్టించి సీకాయతో స్నానం చేస్తే త్వరగా గుణం కన్పిస్తుందని మహిళా మండలిలో ఎవరో చెబితే అదీ నా మీద ప్రయోగించింది——

అబ్బే! అప్పటికే శ్వేతజాతిబలం పెరిగి పోయి వందల సంఖ్యలో కొచ్చేసింది—

"ఏవండీ, అయితే యివి పోవంటారా" అని అడిగిందోరోజు రాత్రి సుమిత్ర.

"ఏం! పోకపోతే విడాకులిచ్చేస్తావా ఏవిటి?" అన్నాను విసుగొచ్చి—

అంతే! ఆ తర్వాత ఆ సంగతే ఎత్తలేదు.

ఇది జరిగిన నెల్లాళ్ళకు కాబోలు ఓ ఆది వారం షేవ్ చేసుకుంటుంటూంటే పేపరు పట్టు కొచ్చింది సుమిత్ర 'ఏవండీ ఇది చూశారా' అంటూ.

"చూళ్ళేదు. చెప్పు" అన్నాను.

"మీరే చూడండి" అంటూ పేజీతీసి, పేపరు నా ముందుంచింది.

"తెల్లవెంట్రుకలుండవ్" అనే టైటిల్ క్రింద బాక్సుకట్టి ఏదోవుంది-అది చదివి ఓ జోక్ గుర్తొచ్చి నవ్వేను.

"ఎందుకా నవ్వు? అందులో జోక్ లేదే" అంది సుమిత్ర సీరియస్‌గా.

"ఇంతకీ ఈ వైద్యవిద్వాన్ ఎవడంటావ్. తెల్లవెంట్రుక లుండవని గ్యారంటీ ఇస్తున్నాడు. స్వయంగా వచ్చి సంప్రదించి చికిత్స పొందండంటున్నాడు. కొంపదీసి కూచోబెట్టి పీకేస్తాడా ఏమిటి?" అన్నాను నవ్వుతూ—

"ఛా. పోనిస్తురూ. మీ జోకులూ మీరూను, ఎవరేం చెప్పినా వినరు. ఎవర్నీ సంప్రదించరు. చూడగాచూడగా యీ తెల్లజుట్టే మీకు బాగు న్నట్టుంది" అంటూ వెళ్ళిపోయింది.

క క క

మనం మర్చిపోదామనుకున్న బాధల్నీ బాధ్యతల్నీ మన చుట్టూవున్న ప్రపంచం మనని మర్చిపోనివ్వదు-ఎప్పటికప్పుడు ఎవరో ఒకరు కన్పించి వేలెత్తి చూపుతూనేవుంటారు. అంకుశంపెట్టి పొడుస్తూనేవుంటారు.

"అర్జంటుగా మద్రాసు వెళ్ళాల్సిన పని తగి లింది - ఫలానారోజు — స్టేషన్‌లో వచ్చి కలువ్" అంటూ కాన్పూరునించి శివరాం యిచ్చిన టెలిగ్రాం పట్టుకుని స్టేషన్‌కి బయ ల్దేరాను — ఆ రోజు కోరమండల్‌కే అత నొస్తున్నది-సిటీ బస్‌కోసం బస్టాపులో నించొని అప్పటికే అరగంట దాటింది-కనీసం అప్పుడు బస్సొచ్చినా మరో అరగంటలో స్టేషన్‌లో వుండొచ్చు.

సరిగ్గా అప్పుడే నా ముందో స్కూటర్ ఆగింది. పరాగ్గా వున్నానేమో, ఎక్కడో చూసిన ముఖంలా వుందనుకుంటూండగానే అతనే పలకరించాడు 'ఏమిటి సార్, బహుకాల దర్శనం. ఎందాకా బయల్దేరారు' అంటూ.

గొంతు విన్నాక గుర్తొచ్చింది. అతను సంతోష్—నేను పాటలు రాసే కొత్తలో నా పాటలు ఆకాశవాణిలో కొన్ని పాడేడతను—

"స్టేషన్‌కండీ" అంటూ సంగతి చెప్పి 'మీరెందాకా' అన్నాను ఆశగా.

"కె.జి.హెచ్.కి. మా బంధువు ఒకాయనకి ఏక్సిడెంటయితే జాయిన్ చేశాం. చూసి పోదామనీ" అన్నాడు—

చెప్పకేం! చాల నిరాశ కలిగింది నాకు.

"ఈ మధ్య మీరు బాగా పికప్ చేశా రండోయ్. వారానికి రెండైనా మీ పాటలు రేడియోలో వస్తున్నాయి. చాల సంతోషం" అన్నాడు సంతోష్ నన్ను సంతోష పెట్టడానికే అన్నట్టు—

"ఏవో....పాత పాటలే—అప్పట్లో రాసి పంపినవే యిప్పుడు తీసుకుంటున్నారు ఒకటీ ఒకటీ...." అన్నాను అతిమామూలుగా.

"మనం కల్సుకుని చాల రోజులై పోయింది" అన్నాడు—

ఔనన్నట్లు తలూపాను.

"మీలో బాగా మార్పు కన్పిస్తోంది-మనిషి కాస్త పుష్టిగా కన్పిస్తున్నారు-కాని...." ఇంకా ఏదో అనబోయాడు.

"ఔనౌను, నా పాటలు తరచు వస్తున్నా యిగా. ఆ సంతోషంతో కాస్త ఉబ్బేనంతే" అన్నాను జోగ్గా.

"ఆనందమూ, తనివీ మనిషిని ఆరోగ్యంగా వుంచుతాయి, కాదన్ను-కానీ మీ జుట్టేమిటండీ. బొత్తిగా పండిపోయిందీ—ఏదైనా వాడక పోయారా" అన్నాడు.

అది మాటకాదు, నా పాలిట బాణం.

నేనింక అతనికెదురుగా నిల్చోలేక రిక్షా






పిల్చి ఎక్కేశాను.

ప్లాట్‌ఫాం టికెట్టు కొనుక్కుని లోపలి కెళ్ళేసరికి బండి రానేవచ్చింది-నన్నాట్టే శ్రమ పెట్టకుండానే ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లోంచి చెయ్యూపి పిలిచాడు శివరాం.

"ఫర్వాలేదు. పోల్చుకున్నాడు" అను

కున్నాను.

కేంటీన్ దగ్గర టీ తాగుతూనే మిగిలిన ఫ్రెండ్స్ గురించీ, కాన్పూర్‌లో అతని చదువు గురించీ, నా ఉద్యోగమూ రచనల గురించీ మాట్లాడుకున్నాం—

"నీ పాటలీమధ్య ఒకటి రెండు విన్నాను" అన్నాడు శివరాం.

నేనేం మాట్లాడలేదు.

ఈ లోగా పచ్చజెండా చూపించాడు గార్డు.

కంపార్టుమెంట్లోకెక్కి తలుపు దగ్గర నిల్చున్నాడు శివరాం.

బండి కదిలింది.

"నువ్వు కాస్త ఆలోచన్లు మానెయ్యాలి" అన్నాడు—

దేన్ని గురించి అంటున్నాడో అర్థంకానట్టు చూశాను—

"అదే—నీ ఉద్యోగం గురించీ యితర సమస్యల గురించీ కాదు. రచనల గురించి అంతకంటే కాదు."

నేనాలోచించి రచనలు చేయనని అతని భావమా?

"ఆలోచించి బెంగెట్టుకున్నకొద్దీ యింకా పండిపోతాయ్.... నే చెప్పేది నీ జుట్టు గురించి" అన్నాడు—

బండితోపాటు నాలుగడుగులు వేయాలనుకున్న వాడినల్లా ఎర్రజెండా చూపించనట్టు అక్కడే ఆగిపోయాను.

* * *

"నమస్కారమండీ."

రామారావుగారు నా వంక అనుమానంగా చూశారు. 'నువ్వెవరోయ్' అన్నట్టు—ఆయన బావమరిది శంకరం నాకు స్నేహితుడు—ఆ సంగతే గుర్తుచేశాను. అతిప్రయత్నం మీద గుర్తు తెచ్చుకుని కూర్చోమన్నాడు. శంకరం ట్రాన్స్‌ఫర్ విషయం, తదితర కుశలప్రశ్నలూ అయ్యాక.

"వీడు మా మేనల్లుడండీ—టౌను ప్లానింగ్ ట్రస్ట్‌లో ఓ చిన్న ప్లాటు కొన్నాడు-అర్బన్ సీలింగ్ క్లియరెన్స్ సర్టిఫికేటేదో అవసరమైంది — దానికి మీ సహాయం కావాలి" అన్నాను మా వాడిని చూపిస్తూ.

"ఓ యస్ దానికేముంది" అంటూ వెంటనే ఫారాలు తెప్పించి మా వాడిచేత నింపించి, నాలుగు రోజులు పోయాక రమ్మన్నాడు.

"అలాగే" అంటూ లేచాను.

"అవునూ-మీరూ యిల్లు కట్టే సందర్భంలోనే రెండేళ్ళ క్రితం నన్ను కలిసారుగదూ" అన్నాడు.

"అవును. ఆ పరిచయం మీదే మిమ్మల్నిప్పుడు కలిశాను" అన్నాను.

"సొంతింట్లోనే వుంటున్నారా?" ఆ ప్రశ్న.

"పూర్తయిందా యిల్లు?" అన్నట్లు విన్పించింది—

"ఇంకా పూర్తికాలేదు సార్" అన్నాను నెమ్మదిగా.

"అదేం? లోనుకూడా తీసుకున్నట్లున్నారు" అన్నాడు ఆ పూర్తి కాకపోవడానికి దబ్బే యిబ్బందయినట్లు—

"తీసుకున్నాను. కానీ ఏం లాభం! డబ్బుతో సంసారాన్ని ఎలాగూ నిలబెట్టలేం. కనీసం కొంపైనా నిలబెట్టుకోగలమని అందులోకి దిగాను. ఇప్పుడు నిండా కూరుకుపోయాను."

"అదేమిటలా!"

"అంతే మరి! నీటికీ సిమెంటుకీ కరువు పోలేదుగా ఈ దేశంలో. కార్డుమీద సిమెంటు అయిదేసి బస్తాలిస్తున్నారు-నీళ్ళు కూడా బిందెల లెక్కన కొనుక్కోవల్సి వస్తోంది. ఆ పరిస్థితుల్లో మా యిల్లు త్రిశంకు స్వర్గమైంది" అన్నాను.

"కష్టమే మరి! మిమ్మల్ని చూస్తేనే తెలుస్తోంది మీ పరిస్థితి. జుట్టుకూడా పండిపోయి వున్నట్టుండి పెద్దవారైపోయారు" అంటూ నవ్వడం మొదలెట్టి.

"మొత్తానికి యిల్లు కట్టకుండానే పండిపోయారు" అంటూ పూర్తి చేశాడు—

నేను గుమ్మందాంటి మెట్లు దిగేసేను.

* * *

"పోనీ అందరూ అంటున్నారని అనుకోకపోతే జుట్టుకు రంగేసుకోరాదుటండీ" అంది సుమిత్ర ఓ రోజు.

అంతకుపూర్వం. ఆ ముక్క ఏ వంద సార్లందో!

"ఛస్తే యిలానే ఛస్తాగాని నేనా 'డై'తో చావలేను" అన్నాను మొండిగా—

రేడియో ఆపేసినట్లు ఆగిపోయింది సుమిత్ర.

* * *

లీవ్ ట్రావెల్ కన్సెషన్ మీద బెనారస్ వెళ్తూ నన్ను కూడా రమ్మని బలవంతం చేశారు మామయ్య. అతగాడికి హిందీ రాదు. కాస్తో కూస్తో నాకు హిందీ వచ్చుననీ, మాట సాయం వుంటుందనీ నా ఖర్చులు తనే భరించాడు.

కాశీ విశ్వనాథ్‌జీని దర్శించి, తులసీ మానస మందిర్ మొదలైనవాట్ని సందర్శించి, చివరగా బెనారస్ విశ్వవిద్యాలయం, బిర్లామందిరం కూడ చూడాలని బయల్దేరం. శివాలయం చూసి బయటకొస్తూంటే ఓ వార్త మా చెవిన బడింది. ఎవరో సాములారు అక్కడే బసచేసి వున్నారనీ, ఆయనగారు భూతభవిష్యత్ వర్తమానాల్ని అద్భుతంగా చెబుతున్నారనీనూ—

'వెళ్దాం పదరా' అన్నాడు మామయ్య. ఆయన జాతకాల పిచ్చి అటువంటిది! ట్రాన్స్‌లేటర్‌గా నాకు తప్పలేదు.

పాతిక రూపాయల ఫీజుకోసం శిష్యుడు చేయిజాపిన అనంతరం మామయ్య ఆయన ముందు చేయి చాచేడు—నిగనిగలాడే నల్లని కురులూ, అందంగా పెంచబడ్డ మీసాలూ, గడ్డాలూ, ఖరీదైన పట్టుపీతాంబరాలూ, వెండి చెంబూ — సాములారు అట్టహాసంగానే వున్నారు.

"మీ కురులు అంత నల్లగా వుండట్నానికి ఏమి వాడతారు స్వామీజీ" అని అడగాలనిపించీ కూడ నోరు కట్టేసుకుని మామయ్య పక్కనే చతికిలబడ్డాను.

స్వాములవారు మెదట నాలుగు ప్రశ్నలు హిందీలో వేసి ఆ తర్వాత తెలుగు వారిమని గుర్తించి తెలుగులోనే మాట్లాడ్డం మొదలు పెట్టేరు—

మామయ్య జీవితచక్రం మీద స్వాములారు విహరిస్తున్నంతసేపూ నన్నెక్కడ చెయ్యి జాపమంటారో అని భయంతో చేతులు వెనక్కు కట్టేసుకుకూర్చున్నాను. జాతకం మాటెలావున్నా పాతికరూపాయలు గోవిందా.

అంతా అయ్యేక, "ఆయనెవరూ? మీ అన్నగారా?" నా వేపు చూపించి బాణాన్ని సంధించారు స్వామీజీ—మామయ్య ముందు ఆశ్చర్యపోయాడు. ఆ తర్వాత ఘొల్లున నవ్వి, "అబ్బే-వాడు....మా మేనల్లుడండీ-నా కంటే వయసులో పదేళ్ళు చిన్నవాడు" అన్నాడు.

మానవజీవితంలోని భూతభవిష్యత్ వర్తమాన కాలాన్ని చెప్పగలిగే స్వాములారి మహిమకు తట్టుకోలేక లేచి పరుగెత్తాను-మామయ్య పిలుస్తున్నా విన్పించుకోకుండా.

* * *

"ఇదిగోనమ్మాయ్. మీ వార్ని తెచ్చి నీ కప్పగిస్తున్నాను" అన్నాడు మామయ్య ఇంట్లో కాలు పెడుతూనే—

సుమిత్ర నా వంక అనుమానంగా చూసింది-

అవును మరి! పదిహేనేళ్ళనించీ సంసారం చేస్తూ పదిహేను రోజుల ఎడబాటుకే నన్ను పోల్చి పట్టలేని తెలివితక్కువదేం కాదు సుమిత్ర — కాకపోతే — మూడేళ్ళ నించీ చూస్తున్న ముఖం ఒక్కసారి మారినట్లు కన్పిస్తే అది ఆమె తప్పా.

"ఏఁవిటీ....మీరు మీరే" అంది ఆశ్చర్యంగా మామయ్యనటు స్నానానికి వెళ్ళనిచ్చి-

"సందేహమేల యింతీ-అంతా ఆ స్వాములారి కృప—"అన్నాను బేగ్‌లోంచి హెయిర్ డై బాటిల్‌ని తీసి టేబిల్ మీదుంచుతూ.